విశాలాంధ్ర
గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

అంపశయ్యపై ఆయుష్

-పర్యవేక్షణ లేమి
-పట్టించుకునేవారే కరువు
-ఆసక్తి ఉన్నా అందని వైద్యం
-దీర్ఘకాలిక వ్యాధులకు ఎంతో ప్రయోజనం

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: ఆయుష్ శాఖ అంపశయ్యపై కొట్టుమిట్టాడుతోంది. ప్రభుత్వాల నిర్లక్ష్యంతో దేశీయ, సంప్రదాయ వైద్యం, ఆయుష్ రోజు రోజుకు తగ్గుతోంది. ఆయుర్వేదిక్, హెూమియో, యునాని, యోగ, సిద్ధ దేశీయ వైద్యాలను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి ఆయుష్ శాఖను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రధానంగా ఆయుర్వేదిక్, యునాని, హెూమియో పతి వైద్యానికి ప్రజల్లో ఆదరణ ఉంది. ఏలూరు జిల్లాలో 18 ఆయుష్ ఆరోగ్య కేంద్రాలు,10 హెూమియో, 4 యునాని కేంద్రాలు ఉన్నాయి. వీటిలో కొన్ని శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ప్రజలకు దేశీయ వైద్యాన్ని అందించాలన్న చిత్తశుద్ధిపాలకులలో కొరవడడంతో ప్రజలకు దేశీయ, సంప్రదాయ వైద్యం అందని ద్రాక్షలా మారింది.

పర్యవేక్షణ లేమి

ప్రాచీన భారతీయ వైద్యాన్ని వెలుగులోకి తీసుకువచ్చి ప్రజలకు అందించాలన్న సదుద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఆయుష్ విభాగాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ విభాగంలో ఆయుర్వేదం, నేచరోపతి, యోగ, హెూమియోపతి, యునాని, సిద్ధా తదితర వైద్య సేవలు ఆయుష్ విభాగం పరిధిలోకి వస్తాయి. జిల్లాలో అరకొర వసతులు, సిబ్బంది కొరత ఈ విభాగాన్ని పట్టిపీడిస్తున్నాయి. ప్రజలకు ఈ వైద్యం పట్ల ఆసక్తి ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో సేవలు అందుబాటులోకి రావడం లేదు. పర్యవేక్షణ అధికారి లేకపోవడంతో ఈ విభాగాన్ని పట్టించుకునే వారే కరువయ్యారు. దీర్ఘకాలిక వ్యాధులకు ఈ విభాగం ఎంతో ప్రయోజన కారిగా ఉంటుంది. వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించిన మూడు విభాగాలకు జిల్లా స్థాయిలో పర్యవేక్షణ అధికారులు ఉండగా ఆయుష్ విభాగానికి ఎవరూ లేకపోవటం, ఉన్న ఇన్చార్జి సరైన పర్యవేక్షణ చేయకపోవడం ప్రధాన లోపంగా కనిపిస్తోంది.

సంబంధిత సిబ్బంది తప్ప దీనికంటూ ఒక ప్రత్యేక కార్యాలయం లేకుండా పోయింది. ఏలూరు కేంద్రంగా పనిచేస్తుండడంతో ఈ విభాగం ఎలా పనిచేస్తుంది..? ఏ సేవలు అందిస్తుందో ప్రజలకు తెలియకుండా పోతోంది. దీంతో ఉన్న కొద్దిపాటి సిబ్బంది విధులను సక్రమంగా నిర్వర్తించడం లేదు. ఉన్న సిబ్బందితో పాఠశాలలు, కళాశాలలో పర్యటిస్తూ అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

సిబ్బంది కొరత

జిల్లాలో ఆయుష్ విభాగానికి సంబంధించి ఖాళీలు కూడా ఎక్కువగానే ఉన్నాయి. ఆయుష్ వైద్య సేవలు సహజసిద్ధమైన మందులతో ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా ఉపశమనం కలిగిస్తుంది. దీర్ఘకాలిక వ్యాధులకు ఈ విభాగం ఎంతో ఉపయోగపడు తుంది. ప్రస్తుతం సరైన మందులు, వైద్యులు, సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో వైద్యం చేయించుకునేందుకు ఆసక్తి ఉన్నవారు కూడా వెనకడుగు వేస్తున్నారు. జిల్లాలోని ఆయుష్ విభాగానికి చెందిన పలువురు వైద్యులు డిప్యూటేషన్ పై ఇతర ప్రాంతాలలో పనిచేస్తున్నారు. శాశ్వత భవనాలు లేకపోవడం, ఉన్న కొద్దిపాటి సిబ్బందితో తూతూ మంత్రంగా పనులు చేయిస్తున్నారు. జిల్లా కేంద్రంలోనూ ప్రత్యేక విభాగం లేకపోవడం ఈ విభాగానికి సంబంధించిన వైద్య సేవలు ఎక్కడ అందుబాటులో ఉంటాయన్న విషయం ప్రజలకు తెలియకపోవడం శోచనీయం. ప్రజల్లో ఆయుష్ వైద్యం పట్ల పెరుగుతున్న ఆసక్తిని గమనించి ప్రభుత్వ వైద్యులు,సిబ్బంది కొరతను తీర్చి ఈ విభాగాన్ని బలోపేతం చేసి పర్యవేక్షణ అధికారిని నియమించి ఆయుష్ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

మాదక ద్రవ్యాల నష్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలి

విశాలాంధ్ర-ఏలూరు: మాదక ద్రవ్యాల వినియోగం వల్ల ఎదుర్కొనే అనారోగ్య సమస్యలపై ప్రజలతోపాటు యువతకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ అన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో నార్కో కో-ఆర్డినేషన్ సెంటర్(ఎన్ సిఓఆర్ డి) జిల్లాస్థాయి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. గంజాయి నియంత్రణ డ్రగ్స్ అక్రమ రవాణా తదితర అంశాలపై సంబంధిత శాఖలు తీసుకున్న చర్యలపై జిల్లా ఎస్పీ డి. మేరీప్రశాంతితో కలిసి జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలను రవాణ, విక్రయం వినియోగించే వారిపై తీసుకునే చట్టపరమైన చర్యలపై అవగాహన కల్పించడంతోపాటు మానసిక వైద్యులు, ఇతర వైద్యులతో మాదక ద్రవ్యాల వినియోగంవల్ల కలిగే ఆరోగ్యపరమైన సమస్యలు, పరిణామాలు, అనర్థాలను తెలియజెప్పేందుకు ఎన్నికల అనంతరం కళాశాలల్లో ప్రత్యేక ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో గంజాయి సాగుజాడలు లేనప్పటికీ ఎన్నికల నేపథ్యంలోఅటవీ ప్రాంతంలో 2 నెలలపాటు అటవీ శాఖ ద్వారా పలు చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలని డిఎఫ్ఓ రవీంద్రదామాను కలెక్టర్ ఆదేశించారు. ఎస్పీ డి. మేరి ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలోఎవరైనా మాదక ద్రవ్యాలను రవాణా చేసిన, కలిగివున్న, సేవించినా, చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మాదక ద్రవ్యాలన్ వినియోగం, అక్రమ రవాణా తదితర ఏరూపంలో వున్నా తీవ్రమైన నేరంగా పరిగణించడం జరుగుతుందన్నారు. సెబ్ జాయింట్ డైరెక్టర్ ఎన్. సూర్యచంద్రరావు మాట్లాడుతూ జిల్లాలో గంజాయి, అక్రమ రవాణా వినియోగం నియంత్రణలో భాగంగా 131 కేసులకు సంబంధించి అనుమానాస్పద షీట్లను తెరవడం జరిగిందన్నారు. సమావేశంలో డిఎఫ్ఓ రవీంద్రదామ, సైకాలిజిస్టులు డాక్టర్ కె. హెచ్ కోమలి, కెసిహెచ్ వీర్రాజు, డాక్టర్ బి. చంద్రహాస్, ఆశ్రమం ఆసుపత్రి ఛీఫ్ అడ్మిన్ బి. ధనిష్ట, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు, వృద్ధులకు ప్రత్యేక సౌకర్యాలు

విశాలాంధ్ర-భీమవరం: సాధారణ ఎన్నికల ఓటింగ్ సమయంలో ప్రత్యేక కేటగిరీకి చెందిన దివ్యాంగులు, సీనియర్ సిటీజన్లు, ట్రాన్స్ జండర్ ఓటర్లకు అసౌకర్యం కలగకుండా సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కాండెక్టను పకడ్బందీగా అమలు చేయడం ద్వారా, ఎక్కడా ఎంసిసి ఉల్లంఘన జరగకుండా చూస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 1,463 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సమయంలో ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్నిరకాల ఏర్పాట్లను సంబంధిత ఏఆర్వోల ద్వారా సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. ముఖ్యంగా అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద టాయిలెట్లు, తాగునీరు, ట్రాన్స్పోర్టేషన్, షామియానాలు, పార్కింగ్ ప్లేస్, ఫస్ట్ ఎయిడ్ బాక్సులు, సూచిక బోర్డులను ఖచ్చితంగా ఏర్పాటుకు ఆదేశాల్లో ఆదేశించినట్లు తెలిపారు. ప్రత్యేకించి దివ్యాంగులు, సీనియర్ సిటీజన్లు, ట్రాన్స్ జెండర్ ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా గ్రౌండ్ ఫ్లోర్ ప్రాధాన్యతతో పోలింగ్ బూత్ ల ఏర్పాటుకు సూచించామన్నారు.

గర్భస్థ పిండ, లింగ నిర్ధారణ చట్టం పటిష్టంగా అమలు చేయాలి

విశాలాంధ్ర-ఏలూరు: గర్భస్థ లింగ పిండ నిర్ధారణ నియంత్రణ చట్టంను పటిష్టంగా అమలు చేయాలనీ ఏలూరు ఆర్డీఓ ఎన్ . ఎస్. కె. ఖాజావలి అధికారు లను ఆదేశించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శనివారం ఏలూరు డివిజన్ స్థాయి గర్భస్థ లింగ పిండ నిర్ధారణ నియంత్రణ చట్టం అమలు కమిటీ సమావేశం లో ఆర్డీఓ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ ఖాజావలి మాట్లాడుతూ గర్భస్థ లింగ పిండ నిర్ధారణ నియంత్రణ చట్టంను అమలు చేయని స్కానింగ్ సెంటర్ లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. గర్భస్థ లింగ పిండ నిర్ధారణ నియంత్రణ చట్టంను మరింత పటిష్టవంతంగా అమలు చేసేందుకు డివిజన్లోని ప్రతీ స్కానింగ్ సెంటర్ లపై కమిటీ సభ్యులు ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. నిబంధనలు పాటించకుండా చట్టాన్ని అతిక్రమించిన స్కానింగ్ కేంద్రాలను సీజ్ చేసి, సంబంధిత స్కానింగ్ కేంద్రాల యాజమాన్యం పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. సమావేశంలో ఏలూరు డిఎస్పీ శ్రీనివాసరావు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగేశ్వరరావు, డిప్యూటీ డెమో నాగరత్నం, కమిటీ మెంబర్లు రంగారావు, సత్యరవి ప్రభృతులు పాల్గొన్నారు.

ఓటింగ్ శాతం పెంచేందుకు స్వీప్ సమావేశం

విశాలాంధ్ర-ఏలూరు: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఓటింగ్ శాతాన్ని పెంచి ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకునేలా బూత్ లెవెల్ ఆఫీసర్స్, క్షేత్రస్థాయి సిబ్బంది సహకరించాలని జిల్లా స్వీప్ నోడల్ అధికారి, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి ఎన్నికల అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం (ఏ.సి 65) రిటర్నింగ్ అధికారి ఎం.ముక్కంటి అధ్యక్షతన బూత్ లెవెల్ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందితో జరిగిన బూత్ లెవెల్ అసోసియేషన్ గ్రూపు (బ్యాగ్) కార్యక్రమానికి స్వీప్ జిల్లా నోడల్ అధికారి, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలమైన ప్రజాస్వామ్యం కోసం అర్హులైన పౌరులందరు ఓటు హక్కు వినియోగించుకునే దిశగా జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా స్వీప్ (సిస్టమటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్) కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా జిల్లాలో ఉన్న ఓటర్లతో సమావేశాలు ఏర్పాటు చేసి ఓటుహక్కు వినియోగంపై అవగాహనా కల్పించడంతో పాటు, ఏథికల్ వోటింగుపై ప్రచారం చేస్తున్నామని అన్నారు. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వాల నుంచి వివిధ సేవలు హక్కుగా ఎలా కోరుకుంటామో అదే మాదిరిగా ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కు వినియోగించుకోవడం సామాజిక బాధ్యతగా గుర్తెరగాలన్నారు. కార్పొరేషన్ కమీషనర్ ఎస్. వెంకటకృష్ణ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలకు సంబంధించి ఏమైనా ఫిర్యాదులు వుంటే సి విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేసే అవకాశం కల్పించబడిందన్నారు. కార్యక్రమంలో ఏలూరు అర్బన్ తహసీల్దార్ ఎం. ముఖర్జీ, అధిక సంఖ్యలో అంగన్వాడీ కార్యకర్తలు, బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ వినియోగంపై శిక్షణ

విశాలాంధ్ర-ఏలూరు: దెందులూరు తహశీల్దార్ కార్యాలయంలో దెందులూరు అసెంబ్లీ నియోజక వర్గానికి సంబంధించి 23 మంది సెక్టార్ అధికారులకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్,బ్యాలెట్ యూనిట్,కంట్రోల్ యూనిట్, వివిఎం ప్యాట్ల వినియోగంపై ఏలూరు జిల్లా వారి ఆదేశాలమేరకు శనివారం శిక్షణాకార్యక్రమం నిర్వహించినట్లు దెందులూరు అసెంబ్లీ నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి,జిల్లా జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణి తెలిపారు. వాటిని ఉపయోగించి ఎన్నికల నిర్వహణ తదితర అంశములపై శిక్షణ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో దెందులూరు, పెదపాడు, ఏలూరు రూరల్, పెదవేగి తహసిల్దార్లు, ఇతర ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

త్రాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు
జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర-ఏలూరు: త్రాగునీటి ఎద్దడిలేకుండా ప్రజలకు త్రాగునీరు సరఫరా అయ్యేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్నవెంకటేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి శనివారం ఎంపిడివోలు తదితరులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో త్రాగునీటి ఎద్దటి నివారణ, ఉపాధిహామీ తదితర అంశాలపై తీసుకోవల్సిన జాగ్రత్తలపై కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడా త్రాగునీటి ఇబ్బంది వుందో అధికారులు ముందుగానే తెలుసుకొని సమస్యను పరిష్కరించాలన్నారు. నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు యుద్ధప్రాతిపధికన అత్యవసర మరమ్మత్తులు చేసేందుకు మండల పరిషత్ నిధులు వినియోగించుకోవాలన్నారు. ఎక్కడా త్రాగునీటి సమస్య ఉత్పన్నంకాకుండా సంబంధిత అధికారులు తగు చర్యలుతీసుకోవాలన్నారు. వేసవి నేపద్యంలో వేడిగాలులు వీచే పరిస్థితులు ఉన్నందున అందుకు తగు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నియమావళి అనుసరిస్తూ ఏప్రిల్ నెల సామాజిక పెన్షన్ చెల్లింపులు ఏప్రిల్ 3వతేదీన అందించబడతాయన్నారు. సమావేశంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ టీ. శ్రీపూజ, జిల్లా రెవిన్యూ అధికారి డి. పుష్పమణి, జెడ్పి సిఇఓ కె.ఎస్.ఎస్.సుబ్బారావు, డిఆర్డిఏ పిడి డా. ఆర్. విజయరాజు, డ్వామా పిడి ఎ. రాము, ఏలూరు ఆర్డిఓ ఎన్ఎస్ కె. ఖాజావలి, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు పిల్లలను బాగా చదివించాలి

విశాలాంధ్ర- తాడేపల్లిగూడెం రూరల్ : పిల్లలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడానికి తల్లిదండ్రులు పిల్లలను బాగా చదివించాలని ప్రభుత్వ సబ్ డివిజన్ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు రొక్కాల నాగ బుజ్జి అన్నారు. శనివారం రామన్నగూడెం ఎస్సీ కమ్యూనిటీ హాల్ వద్ద పౌర హక్కుల దినోత్సవం తాసిల్దార్ బి. మురళీ కృష్ణ అధ్యక్షతన జరిగింది. దళితులకు స్మశాన వాటిక సమస్యను , ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని అధికారుల దృష్టికి దళితులు తీసుకొచ్చారు. ముఖ్య అతిథిగా ప్రభుత్వ సబ్ డివిజన్ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు రొక్కాల నాగ బుజ్జి మాట్లాడుతూ తాడేపల్లిగూడెం ఆర్డీవో చెన్నయ్య ఆధ్వర్యంలో ప్రభుత్వ అధికారులు దళితుల సమస్యలను అద్భుతంగా పరిష్కరిస్తున్నారని కొనియాడారు. తాసిల్దార్ మురళీకృష్ణ , ఎంపీడీవో సుబ్రహ్మణ్య శర్మ, సహాయ సాంఘిక శాఖ అధికారి రామాంజనేయం రాజు, వీఆర్వో మంగరాజు, రాము, పంచాయతీ కార్యదర్శి వేణు అరవింద్, రూరల్ పోలీసులు, మహిళా పోలీస్ అన్నపూర్ణ , దళితులు పాల్గొన్నారు.

పోలవరంలో ప్రతాప్ పర్యటన

విశాలాంధ్ర-చాట్రాయి: పోలవరంలో నూజివీడు శాసనసభ్యులు ప్రతాప్ పర్యటన చేశారు.వందలాది మంది వైసిపి కార్యకర్తలు మోటారు సైకిళ్ళ ర్యాలీ నిర్వహించారు. శనివారం సాయంత్రం చాట్రాయి మండలం పోలవరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చరిత్రలో ఎన్నడూలేని విధంగా వైసీపీ పాలనలో సంక్షేమ పథకాలు అమలు చేసారన్నారు.మండలంలో సుమారు 330కోట్ల రూపాయలతో సంక్షేమం, అభివృద్ధి చేసినట్టు తెలిపారు. చరిత్రలో జగన్మోహన్ రెడ్డి లాంటి ముఖ్యమంత్రిని ఎన్నడూ చూడలేదన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు చెలికాని బాబ్జి, శ్రీరాం, వైసీపీ మండల అధ్యక్షులు మిద్దే బాలకృష్ణ, పర్వతాపురం సర్పంచ్ శివాజీ, సోమవారం సర్పంచ్ శోభన్ బాబు, జల్లేపల్లి పరమేశ్వరరావు,వనమా వాసు, పోలవరం సర్పంచి సత్తెనపల్లి లక్ష్మి, దామెర ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి తావు లేకుండా పరిపాలన

విశాలాంధ్ర - కలిదిండి: అవినీతికి తావు లేకుండా పరిపాలన ముఖ్యమంత్రి జగనన్న అందించారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు అన్నారు. శనివారం కలిదిండి పరిధిలోని 6,7వ వార్డులలో నాయకులతో కలసి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామం సుస్థిర అభివృద్ధి చెందేలా అన్ని గ్రామాలకు మౌలిక వసతులు జగన్ కల్పించారని అన్నారు. ప్రజల మధ్యకు వెళుతుంటే ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని ఏ గడప గడపకు వెళ్లిన ప్రతి ఒక్కరు అన్ని విధాలా మాకు సంక్షేమం, అభివృద్ధి అందిస్తున్న మాకు మద్దతుని తెలుపుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చందన. ఉమామహేశరరావు, మండల పార్టీ అధ్యక్షులు తిరుమాని రమేష్, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, సర్పంచ్ మసిముక్కుల మారుతి ప్రసన్న, వెంకటేశ్వరరావు, కొల్లాటి. సత్యనారాయణ, ఎంపీటీసీ షఫాయితుల్లా, నీలి సుమన్, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్- రేతో కోవిడ్ 19 నిర్ధారణ

విశాలాంధ్ర -భీమవరం: ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ,మిషన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ విధానంలో తీసిన ఎక్స్- రే తో కోవిడ్ -19 ను ఖచ్చితమైన నిర్ధారణ చేయవచ్చునని ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కనుమూరి చలపతి రాజు అన్నారు. తన పరిశోధనలతో నూతన విధానాన్ని కనుగొన్నారు. ఆయన చేసిన పరిశోధనలకు గాను కర్ణాటకలోని విశ్వేశ్వరయ్య టెక్నాలజికల్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రధానం చేసిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి మురళీకృష్ణంరాజు చెప్పారు. ఈ సందర్భంగా డాక్టర్ చలపతి రాజును కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంత వర్మ యాజమాన్యం తరపున ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ చలపతి రాజు మాట్లాడుతూ సుమారు 20 వ్యాధులకు సంబంధించి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డీప్ లెర్నింగ్ మిషన్ లెర్నింగ్ విధానంతో తీసిన ఎక్సరే తో రోగ నిర్ధారణ చేసేందుకు ఆస్కారం ఉందని తక్కువ సమయంలో రోగ నిర్ధారణ చేసేందుకు తమ పరిశోధన ఎంతగానో దోహద పడుతుందని ఆయన పేర్కొన్నారు. యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ రేణు మాధవి పర్యవేక్షణలో "డెవలప్మెంట్ ఆఫ్ కంప్యూటేషన్ ఇంటిలిజెన్స్ మోడల్ టు సపోర్ట్ దయాగ్నోసిస్ ఆఫ్ కోవిడ్- 19 ఫ్రమ్ చెస్ట్ ఇమేజెస్" అనే అంశంపై తాను చేసిన పరిశోధనకు గాను విశ్వేశ్వరయ్య టెక్నాలజికల్ యూనివర్సిటీ తనకు డాక్టరేట్ ప్రదానం చేసిందన్నారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం. జగపతి రాజు మాట్లాడుతూ ప్రపంచాన్ని కుదిపివేసిన కోవిడ్ 19 ని గుర్తించడంలో భారతీయ యువ శాస్త్రవేత్తలు నిరంతరం పరిశోధనలు చేస్తున్నారని, అందులో తమ కళాశాల యువ అధ్యాపకులు కూడా భాగస్వాములు కావటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఈసీఈ హెడ్ డాక్టర్ ఎన్ ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి సెగ

విశాలాంధ్ర -భీమవరం: ఆదిలోనే హంస పాదన్న చందంగా భీమవరం నియోజకవర్గం ఎన్డీఏ కూటమిలో పొత్తుకు బీటలు బాహటంగానే పడ్డున్నాయి. నర్సాపురం పార్లమెంటు బిజెపి అభ్యర్థిగా భూపతిరాజు శ్రీనివాస వర్మ ను పార్టీ ప్రకటించిన దగ్గర నుంచి మిత్రపక్షాలయిన టిడిపి, జనసేన శ్రేణులు జీర్ణించుకోలేక, భూపతిరాజుకు మద్దతివ్వలేక మల్లగుల్లాలు పడుతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో సిట్టింగ్ ఎంపీ కనుమూరి రఘురామ కృష్ణంరాజు కూటమి అభ్యర్థి అయితేనే వైసిపికి బలమయిన పోటీ ఇచ్చి ఎంపి సీటుతో పాటు నర్సాపురం పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ స్థానాలు కూడా గెలుస్తామని టిడిపి, జనసేన శ్రేణులు బాహటంగానే చర్చించుకుంటున్నాయి. సీటు ప్రకటించిన తరువాత బిజెపి ఎంపి అభ్యర్థి భుపతిరాజు శ్రీనివాసవర్మ తొలిసారి భీమవరం విచ్చేసిన పర్యటనలో ఆసాంతం టిడిపి, జనసేన శ్రేణులు ఎక్కడా కానరాలేకపోవడం గమనార్హం. పుండు మీద కారం పూసిన చందంగా భీమవరం అసెంబ్లీ జనసేన అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు తన అనూయాయులతో కలిసి రఘురామ కృష్ణంరాజు ను మర్యాదపూర్వకంగా కలవడం చర్చనీయాంశమైంది. ఇదే సందర్భంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, టిడిపి మహిళా జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి, వీరవాసరం టిడిపి ఎంపిపి వీరవల్లి విజయలక్ష్మి, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు వీరవల్లి చంద్రశేఖర్, టిడిపి బిసి సాధికారత జిల్లా కమిటీ అధ్యక్షుడు గంటా త్రిమూర్తులు పట్టణ టిడిపి మహిళా కమిటీ సభ్యులు తమ మందీ మార్బలంతో రఘురామ కృష్ణంరాజును మర్యాద పూర్వకంగా కలవడంతో రాజకీయాల్లో పలు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. పార్లమెంటు పరిధిలోని కూటమి అభ్యర్థులందరినీ సమన్వయం చేసుకుంటూ కూటమి గెలుపుకు కృషిచేస్తామని బిజెపి అభ్యర్థి భూపతిరాజు తెలిపారు.

వర్మే నరసాపురం బీజేపీ ఎంపీ అభ్యర్థి

విశాలాంధ్ర -భీమవరం: నరసాపురం పార్లమెంట్ అభ్యర్థిగా భూపతిరాజు శ్రీనివాస్ వర్మనేనని, ఆరు నూరైనా వర్మ ఎంపిక మారదని బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ పాకా సత్యనారాయణ అన్నారు. భీమవరం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపి స్థానాలను మాత్రమే కూటమి నిర్ణయమని, అభ్యర్థులపై జాతీయ స్థాయిలో తీసుకునే పొత్తు ధర్మాన్ని పాటించాలని, అభ్యర్థుల మాటలు చెల్లవని, అవన్నీ అధిష్టానం నిర్ణయమని అన్నారు. బిజెపిలో ఒక్కసారి సీటు ప్రకటించాక మార్చడం అనేది జరగదని, నర్సాపురం ఎంపి అభ్యర్థిగా శ్రీనివాస్ వర్మ నేనని అన్నారు. జిల్లా మహిళ మోర్చ నూతన కమిటీని ఎన్నుకున్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి ఉపన్యాసం

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం శ్రీ చింతలపాటి వరప్రసాద మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల విభాగం వారిచే అతిథి ఉపన్యాసం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక వక్తగా రాజమహేంద్రవరం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆంగ్ల అధ్యాపకులు కెఎస్ రత్నకుమార్ విచ్చేసి విద్యార్థులకు కావలసిన ఆంగ్ల నైపుణ్యాన్ని మెరుగుపరుచుకునే మెళకువలు, జీవన నైపుణ్యాలు(లైఫ్ స్కిల్స్) వివరించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాకలపాటి నిర్మల కుమారి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రత్యేక ఉపన్యాసాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. అనంతరం ప్రిన్సిపల్ చేతుల మీదగా రత్నకుమార్‌కు మెమెంటుతో సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ఆంగ్ల అధ్యాపకులు డాక్టర్ అక్కిరాజు వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

సెక్టార్ అధికారులు ప్రతి పోలింగ్ కేంద్రాన్ని మూడుసార్లు తనిఖీ చేయాలి

విశాలాంధ్ర-భీమవరం: సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగు కేంద్రాలలో శాంతియుతంగా ఎక్కువ శాతం పోలింగు నమోదు అయ్యేలా, సెక్టార్ అధికారులు ప్రతి పోలింగ్ కేంద్రాన్ని మూడుసార్లు తప్పక తనిఖీ చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్, ఉండి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సివి ప్రవీణ్ ఆదిత్య అన్నారు. శనివారం స్థానిక కలెక్టరేటు వశిష్ఠ కాన్ఫరెన్స్ హాలులో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఉండి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన అసిస్టెంటు రిటర్నింగు అధికారులు, సెక్టార్ అధికారులు, ఉప తహశీల్దార్లు, అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్లు (ఎ.ఎల్.ఎం.టి. ఎస్) లతో ప్రీ-పోలింగు పై శిక్షణ కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉండి నియోజకవర్గంలోని సెక్టోరల్ అధికారులు ప్రతి పోలింగు కేంద్రాన్ని తప్పక మూడు సార్లు తనిఖీ చేసి లొకేషన్, రూట్ మ్యాప్‌ను పరిశీలించాలన్నారు. ప్రతి పోలింగు బూత్ పరిధిలో స్థానిక ఓటర్లతో బి.ఎల్.ఓ.లతో కలిసి రెండు సార్లు సమావేశాలు ఏర్పాటు (రాజకీయ నాయుకులను మినహాయించి) చెయ్యాలని సెక్టోరల్ అధికారులకు సూచించారు. . ఈ కార్యక్రమంలో ఉండి అసెంబ్లీ నియోజకవర్గం అసిస్టెంటు రిటర్నింగు అధికారులు, సెక్టార్ అధికారులు, ఉప తహశీల్దార్లు, అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్లు (ఎ.ఎల్.ఎం.టి. ఎస్.లు), తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా

విశాలాంధ్ర-లింగపాలెం: ఆసన్నగూడెం బాధరాల మార్గంలో పామాయిల్ మట్టల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ గుంతలలో పడి బోల్తా కొట్టింది. అదృష్టవశాత్తు ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.ఈ మార్గంలో గోతులు ఉండి రాకపోకలకు తీవ్ర అంతరాయంగా ఉంది. ఈ మార్గాన్ని పక్కాగా నిర్మించాలని ప్రజలు కోరుతున్న అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ మార్గంలో నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఏళ్ల తరబడి ఈ మార్గాన్ని మరమ్మత్తు చేయాలని కోరుతున్న అధికారులు పట్టించుకోవటం లేదనే విమర్శలు ఉన్నాయి. ప్రమాదాల బారిన పడి గాయాలు పాలవుతున్నారు. ప్రమాదాలు నివారణ జరగాలంటే రహదారిని పునర్నిర్మించాలి.

దివ్యాంగుల సమగ్ర అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం

విశాలాంధ్ర-ఆగిరిపల్లి: దివ్యాంగుల జీవితాలలో వెలుగులు నింపడంతో పాటు వారి సమగ్ర అభివృద్ధికి దాతల సహకారం అవసరమని నూజివీడు డివిజనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ లక్ష్మయ్య అన్నారు. మండలంలోని తోటపల్లి లో గల ఎలిజబెత్ పాంటన్ లెగసీ ఆఫ్ హెూప్ - హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో పూర్వాన్ష్ హెూల్డింగ్ లిమిటెడ్-హైద్రాబాద్ వారి ఆర్థిక సహాయముతో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన 50మంది దివ్యాంగులకు కృత్రిమ కాళ్ళను అందచేసిన సందర్భముగా ఆయన మాట్లాడారు. హీల్ -సిఈఓ కూరపాటి అజయ్ కుమార్ మాట్లాడుతూ తమ కృత్రిమ అవయవ కేంద్రం ద్వారా 18 సంవత్సరాల లోపు దివ్యాంగ బాలలు 170 మందికి 271కృత్రిమ కాళ్ళను, 276 వయోజన దివ్యాంగులకు కృత్రిమ కాళ్ళను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో హీల్ క్యాంపస్ చైర్మన్ పిన్నమనేని ధనప్రకాష్, ప్రముఖ వ్యాపారవేత్త దండమూడి శ్రీధర్, పూర్వాన్ష్ హెూల్డింగ్ ప్రయివేట్ లిమిటెడ్ ప్రతినిధి స్వప్న, హీల్ కార్యదర్శి తాతినేని లక్ష్మీ, ప్రిన్సిపాల్ బి. సాయిబాబు, హీల్ క్రీడా విభాగపు ప్రతినిధులు కిషోర్, సుధాకర్, ఫెసిలిటీస్ డైరెక్టర్ టి. భాస్కర్, సమాజసేవకురాలు ఎల్. ద్రాక్షాయని, సీనియర్ టెక్నీషియన్ కె. చిన్నా తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయంలో 9న ఉగాది వేడుకలు

విశాలాంధ్ర-ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి దేవస్థానంలో ఏప్రియల్ 9న శ్రీక్రోదినామ ఉగాది పురస్కరించుకుని అన్నిఏర్పాట్లు జరుగుతున్నాయని ఆలయ కార్యనిర్వాహణాధిధారి వేంద్ర త్రినాధరావు పేర్కొన్నారు. దీనికోసం గ్రామంలోని ఉగాదిమండపానికి రంగులు వేసి విద్యుద్దీప అలంకరణలు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ శ్రీక్రోదినామ సంవత్సర వేడుకలు ఆలయంలో శాస్త్రోక్తంగా నిర్వహిస్తామన్నారు. ఉదయం ఆలయంలో పుష్పాలంకరణ, మామిడితోరణాలతో అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. సాయంకాలం 4గంటలకు సాంప్రదాయ బద్ధంగా శ్రీవారిని శేషవాహనంపై ఉంచి ఉగాది మండపం వద్దకు తెచ్చి పూజలు నిర్వహిస్తామన్నారు. అనంతరం పంచాంగ శ్రవణం, పండిత సత్కార కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

కంప్యూటర్ ఆపరేటర్‌కు సన్మానం

విశాలాంధ్ర-లింగపాలెం: విద్యాశాఖ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసి పదవీ విరమణ చేసిన శివరామకృష్ణను మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు సన్మానించారు. కంప్యూటర్ ఆపరేటర్ గా శివరామకృష్ణ తమ విధులను బాధ్యతగా నిర్వర్తించి అందరి మన్ననలను పొందారని విద్యాశాఖ అధికారులు రామారావు, రవీంద్ర అన్నారు. మండలంలోని ఉపాధ్యాయులు ఈయన చేసిన సేవలను కొనియాడుతూ సన్మాన కార్యక్రమంలో కీర్తించారు. ఈ సందర్భంగా మండలంలో ఉన్న ఉపాధ్యాయు లంతా పదవీ విరమణ చేసిన ఆపరేటర్ కు రూ.1.30 లక్షల నిధులను విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఈయన మాట్లాడుతూ తనను ఆదరించిన మండల విద్యాశాఖ అధికారులకు, ఉపాధ్యాయులకు, సీఆర్పీలకు, ఐఈఆర్టీలకు, పిటిఐలకు రుణపడి ఉంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ నాయకులు అప్పలస్వామి, నగరం శ్రీనివాస్, సొంగా నాగేశ్వరరావు, జిటి స్వామి, సిహెచ్ సాల్మన్ రాజు, ఎస్ రమేష్ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, సిఆర్పిలు పాల్గొన్నారు.

గుండెపోటుతో వీఆర్వో పుల్లారావు మృతి

విశాలాంధ్ర-టి నరసాపురం: గుండె పోటుతో టి నరసాపురం 2 వీఆర్వో హెచ్చు పుల్లా రావు (48) మృతి చెందిన సంఘటన శనివారం కె జగ్గవరంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపినవివరాల ప్రకారం పుల్లా రావు శనివారం తెల్లవారుఝామున అస్వస్థతకు గురికావడంతో కుటుంబసభ్యులు చింతలపూడి ప్రైవేటు ఆసుపత్రికి తీసుకు వెళ్ళారు.అప్పటికే మృతి చెందినట్టు డాక్టర్ నిర్ధారించారు. ఆయన స్వగ్రామం కె జగ్గవరంలో అంత్యక్రియలు నిర్వహించారు. టి నరసాపురం తహసీల్దార్ శుభాష్ సిబ్బందితో వచ్చి పుల్లా రావు మృత దేహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. గత 16 సంవత్సరాలుగా విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేస్తూ మంచి పేరు తెచ్చుకొన్నాడని ఆయన సేవలను కొనియాడారు. మృతునికి భార్య, ఇద్దరు సంతానం వున్నారు.

ప్రతి గడపకు సంక్షేమ ఫలాల ఘనత వైసీపీదే

విశాలాంధ్ర -ముదినేపల్లి : అర్హులైన ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు అందించిన ఘనత వైసిపి దేనని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు అన్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని కోమర్రు గ్రామంలో ప్రజా ఆశీర్వాద యాత్ర 32వ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడిన సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, పార్లమెంట్ అభ్యర్థిగా కారుమూరి సునీల్ కుమార్ యాదవ్ ను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఘంటా సంధ్య , వైస్ ఎంపీపీలు చోప్పర్ల సునీత, రాచూరి రాధ, సర్పంచ్ కూనపురెడ్డి శ్రీ సాయి కృష్ణ తదితరులు కార్యకర్తలు పాల్గొన్నారు. మహిళలు ఎమ్మెల్యేకు హారతులతో స్వాగతం పలికారు.

ముక్కుడు ముత్యాలమ్మ ఆలయ ప్రారంభోత్సవం

విశాలాంధ్ర–చింతలపూడి: నారు పోసినా.. నాట్లు వేసినా.. కోత కోసినా కుప్ప నూర్చినా రైతులు,కూలీల వ్యవసాయక జీవన విధానంలో ఒక భాగమె ప్రతినిత్యం పూజలందు కుంటూ కోరిన కోర్కెలు తీర్చే దేవతగా శావణ మాసంలో పాలు పొంగళ్లతో సేవలు చేయించుకునే చారిత్రక నేపథ్యం

కలిగిన...శివపురం పురాతన ముక్కుడు ముత్యాలమ్మ అమ్మవారికి నూతన ఆలయ నిర్మాణం ప్రారంభోత్సవం చేసి వేలాదిమందికి మహా అన్నదానం చేశారు. ఆడపడుచులు జలాభిషేకాలు చేసి. భక్తి శ్రద్ధలతో పాలపొంగళ్ళతో నెత్తిన బోనాలు ఎత్తుకున్నారు.... ఆడపడుచు ల రాకతో శివపురం గ్రామంలో ఇంటింటా పండుగ శోభ సంతరించుకుంది .ఆంధ్ర తెలంగాణ సరిహద్దు ప్రాంతంలోని చింతలపూడి మండలం శివపురం గ్రామంలో గడచిన మూడు రోజుల నుండి మంగళ వాయిద్యాలతో వేదమంత్రాలు నడుమ శనివారం ఉదయం నిర్మించిన పురాతన అమ్మవారికి ఆలయాన్ని ప్రారంభోత్సవం చేశారు. సరిహద్దు ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గడచిన మూడు రోజులుగా చేసిన కార్యక్రమాలు ప్రజల దృష్టిని ఆకర్షించాయి.

చిన వెంకన్న హుండీల ఆదాయం లెక్కింపు

విశాలాంధ్ర–ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారికి భక్తులు హుండీల్లో వేసిన కానుకల ద్వారా రూ.1,52,94,247 ఆదాయం సమకూరిందని ఆలయ కార్యనిర్వహణాధి కారి వేంద్ర త్రినాథరావు పేర్కొన్నారు. శ్రీవారి ఆలయ పరిదిలో శనివారం హుండీల

లెక్కింపు జరిగింది. ఈవో తెలిపిన వివరాలు ప్రకారం గడచిన 17రోజులకు పైనగదుతోపాటు 301గ్రాముల బంగారం 3కేజీల 392గ్రాముల వెండి లభించాయన్నారు. వీటితోపాటు చెల్లని 500నోట్లు 7, వెయ్యినోట్లు 3, 2వేల నోట్లు 14 వచ్చాయన్నారు. లెక్కింపులో దేవస్థానం సిబ్బంది, యూనియన్ బ్యాంక్ సిబ్బంది, ఆగమపాఠశాల విద్యార్థులు శ్రీవారి సేవాభక్తులు పాల్గొన్నారు.

జగన్‌ను ఇంటికి సాగనంపుదాం

విశాలాంధ్ర - పెంటపాడు: అవినీతి అక్రమాలు హత్యలు చేసేసి వాటిని వేరే వారి ఖాతాలోకి నెట్టేసిన అబద్ధాల జగన్ ను ఇంటికి సాగనంపుదామని తాడేపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి, బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు.పెంటపాడులో శనివారం నిర్వహించిన జనసేన పల్లెపోరును కూటమి నాయకులతో కలిసి నిర్వహించారు.పెంటపాడు శివాలయం వద్ద బొలిశెట్టికి కూటమి నాయకులు, కార్య కర్తలు ఘన స్వాగతం పలికారు.ఇంటింటికి వెళ్లి పల్లెపోరు కరపత్రాలను పంచిపెడుతూ

ప్రజలను కలిసి తనను గెలించాలని కోరారు. అనంతరం వలవల బాబ్జి, ఈతకోట తాతాజీ మాట్లాడుతూ బొలిశెట్టి శ్రీనివాస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా బొలిశెట్టి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఒక అవినీతి తిమింగలం తనపై అవినీతి ఆరోపణలు చేస్తున్నారని, తాను మున్సిపల్ చైర్మన్ గా చేసినప్పుడు ఏదైనా అవినీతి చేసినట్టు నిరూపిస్తే, బహిరంగంగా ఉరి వేసుకునేందుకు సిద్ధమన్నారు. దీనిపై చర్చించే దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో గొర్రెల శ్రీధర్, కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, పుల్లా బాబీ,కొనకళ్ళ హరనాథ్,దత్తు ప్రసాద్,జనసేన,టిడిపి,బిజెపి కార్యకర్తలు నాయకులు భారీగా హాజరయ్యారు.

దోసపాడులో పోలీసు బలగాల మోహరింపు సిగ్గుచేటు

విశాలాంధ్ర–ఏలూరు : దోసపాడు పేదలకు న్యాయం చేయాలని, అసైన్డ్, సీలింగ్ భూములపై సర్వే నిర్వహించి పేదలకు పంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం, దోసపాడు భూ పోరాట కమిటీల ఆధ్వర్యంలో చేపల చెరువుల దగ్గరకు వెళ్తున్న దళితులు, పేదలు, వ్యవసాయ కార్మికులను పోలీసు బలగాలు

శనివారం దోసపాడు గ్రామంలో అడ్డుకున్నాయి. తొలుత వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి. రామకృష్ణను ఏలూరు రెండవ పట్టణ పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. అనంతరం దెందులూరు ఎస్ఐ స్వామి 50మంది కానిస్టేబుళ్లు,ఫోర్సుతో గ్రామం చేరుకొని పేదలను దళితులను భయభ్రాంతులకు గురి చేశారు. రాత్రి పగలు అని తేడా లేకుండా నిన్న రాత్రి 11గంటలకు ఇండ్లలో ఉన్న మహిళలను అని చూడకుండా మగ పోలీసుల ఫోటోలు, వీడియోలు తీయడం సిగ్గుచేటు అన్నారు. ప్రశ్నించిన వారిపై కేసులో పెట్టి పోలీస్ స్టేషన్ పంపిస్తామని బెదిరించడం ప్రజాస్వామ్యమా లేక రాచరికమా అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి. రామకృష్ణ మాట్లాడుతూ దళితుల పట్ల రెవిన్యూ, పోలీస్ అధికారులు మొండిగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ పోరాటం ప్రారంభమయ్యాక రాష్ట్ర ముఖ్యమంత్రి రెండు దఫాలు దెందులూరు నియోజకవర్గంలో పర్యటించినా దళితులకు న్యాయం జరగలేదన్నారు. దోసపాడు గ్రామంలో దళితుల, పేదలు రెండు సంవత్సరల కాలం నుండి అధికారులను న్యాయం చేయాలని అడుగుతుంటే వీరిపై మండల రెవిన్యూ శాఖ, పోలీసులు కుమ్మక్కై చట్ట ధిక్కరణ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. మరోసారి దోసపాడలో పేదలు దళితులు వారి హక్కుల కోసం, భూముల కోసం పోరాడుతున్న వారిపై శనివారం దెందులూరు ఎస్ ఐ స్వామి పోలీస్ బలగాలను పంపి గ్రామం మొత్తం భయభ్రాంతులకు గురిచేసారని మండిపడ్డారు. చట్టాన్ని ధిక్కరించిన వారి పైన వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

టీడీపీ నుంచి వైసీపీలోకి చేరికలు

విశాలాంధ్ర - పాలకొల్లు: పాలకొల్లు మండలం అరట్లకట్ల గ్రామంలో టిడిపి నుండి 10కుటుంబాలకు చెందిన వ్యక్తులు శనివారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల గోపి, వీరికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పోలిశెట్టి లక్ష్మీనారాయణ, గుడాల ఏడుకొండలు, నున్నబోయిన వెంకటేశ్వర్లు, గుణపాత్తి దుర్గారావు, పాల వెంకటేష్, గుత్తుల దుర్గబాబు, నున్నబోయిన విశ్వేశ్వరరావు, చింతపల్లి రమణ తదితరులు వైసీపీలో చేరారు.

ధర్మరాజు ఆధ్వర్యంలో తాగునీరు సరఫరా

విశాలాంధ్ర - నిడమర్రు: నిడమర్రు మండలంతోకలపల్లి గ్రామ ప్రజలు త్రాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారని జనసేన నాయకులు శనివారం తెలియజేయగా వెంటనే స్పందించిన ఉంగుటూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ పత్సమట్ల ధర్మరాజు శ్రీ లక్ష్మి నారాయణ ఫౌండేషన్ వాటర్ ట్యాంకర్ ద్వారా త్రాగునీరు సరఫరా చేశారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు మర్రిపూడి బంటీ, భలే నాగబాబు, గణశల దినేష్,రాధ, గ్రామ జనసైనికులు, తదితరులు పాల్గొన్నారు.

కొవ్వలినాయుడును కలిసిన బీజేపీ ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్‌వర్మ

విశాలాంధ్ర–నరసాపురం: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడును శనివారం నర్సాపురం పార్లమెంట్ కూటమి అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ కలిశారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో

జనసేన, తెలుగుదేశం పార్టీలు బలపర్చిన బిజెపి ఎంపి అభ్యర్థిగా తనకు వచ్చిందని, ఈ ఎన్నికల్లో తనను అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేయాలని రామ్మోహన్ నాయుడును శ్రీనివాస్ వర్మ కోరారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ వర్మనుకు శాలువా కప్పి రామ్మోహన్ నాయుడు చిరు సత్కారం చేశారు. తమ సంపూర్ణ మద్దతు వర్మకు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు పులపర్తి వెంకటేశ్వరరావు, డాక్టర్ ఇలపకుర్తి ప్రకాష్, గునిసెట్టి శ్రీనివాస్, మునుకోటి వెంకటేశ్వరరావు, కంచర్ల నాగేశ్వరరావు, జోశ్యుల విశ్వప్రతాప్, మోచర్ల శిరీష, గన్నాబత్తుల సత్యవతి తదితరులు ఉన్నారు.

స్వతంత్ర అభ్యర్థిగా కొప్పర్రు మాజీ సర్పంచ్ లక్ష్మీఫణి

విశాలాంధ్ర–నరసాపురం: సాధారణ ఎన్నికలలో నరసాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా రావూరి(గుత్తా)లక్ష్మీఫణి ఎన్నికల బరిలో నిలిచేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు ఆమె అనుచరులు తెలిపారు. నియోజకవర్గంలో ప్రధాన పార్టీలు వారి వారి అభ్యర్థులను ప్రకటించడంతో ఇక్కడ ఏర్పడిన శూన్యతను దృష్టిలో పెట్టుకొని లక్ష్మీ ఫణి ఆత్మగౌరవం,స్థానికత నినాదంతో లక్ష్మీ ఫణి ఎన్నికల బరిలోకి దిగేందుకు నిశ్చయించు

కున్నట్లు సమాచారం. ప్రస్తుతం అధికార వైకాపా తన అభ్యర్థిగా క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన సిట్టింగ్ ఎమ్మెల్యే ముదునూరు ప్రసాద్ రాజు కే తిరిగి టికెట్ కేటాయించింది. ఎన్డీఏ కూటమి తరుపున జనసేన పార్టీ అభ్యర్థిగా అగ్నికుల క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన బొమ్మిడి నాయకర్ కు సీటు దక్కింది. నియోజకవర్గంలో సుమారు 70 వేలకు పైబడి ఓటు బ్యాంకు కలిగిన సామాజిక వర్గాన్ని అన్ని పార్టీలు నిర్లక్ష్యం చేయడానికి ఆ సామాజిక వర్గం జీర్ణించుకోలేక పోతుంది. వారంతా తీవ్ర అంతర్మథనం చెందుతున్నారు. ఈ సామాజిక వర్గంలోని ఆ నలుగురు నాయకులు రానున్న ఎన్నికలలో ఆయా పార్టీలు సీట్లు కేటాయించిన అభ్యర్థుల విజయానికి పాటు పడతామని ప్రత్యక్షంగా పరోక్షంగా వెల్లడించిన విషయం తెలిసిందే. అత్యధిక ఓటు బ్యాంకు కలిగిన తమ సామాజిక వర్గాన్ని రాజకీయ పార్టీలు నిర్లక్ష్యం చేయడంతో ఈ సామాజిక వర్గంలోని నాయకులే కాక సాధారణ ఓటర్లు సైతం జీర్ణించుకోలేక పోతున్నారు. తమ సామాజిక వర్గానికి చెందిన ఎవరైనా ఎన్నికల బరిలో నిలిస్తే వారిని గెలిపించుకుంటామని అంతర్గత చర్చలు జరుగుతున్నాయి. ఈ దశలో రావూరి బరిలో నిలుస్తారని వార్తలు బయటకు వస్తుండడంతో ఆ సామాజిక వర్గంలో అంతర్గతంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

వైసీపీలో చేరికలు

విశాలాంధ్ర–పెనుగొండ: ములపర్రు పుల్లిల్ల వారి పేట సంఘ సభ్యులు తూర్పు పాలెం క్యాంపు కార్యా లయంలో మాజీ మంత్రి, జిల్లా పార్టీ అధ్యక్షులు ఆచంట

శాసనసభ్యులు చెరుకువాడ శ్రీరంగనాథ రాజు సమక్షంలో వైసిపి లో చేరి కండువా ధరించారు. సరెళ్ళ రమేష్, ఊడి రమేష్, ఇట్ట స్వామి దాసు, పులిల్ల కొండయ్య, కేసరపల్లి గిరి రవీంద్ర, నంది శీను, విపర్తి సుందర్రావు, ఊడి నాగేశ్వరరావు, ఇట్ట పూర్ణాజీ, కటికిదల ప్రసాదు, మంద దావీదు, నంది హేమంత్, ఊడి కోటేశ్వరరావు, ఊడి మనోజ్ కుమార్, కోటి రామారావు, కోట శివయ్య, ఇట్టా సారధి, కోటి రాజు, కేసరపల్లి నవీన్, కటికదల గోపి, కటికదల రవి, కేసరపల్లి గంగాధర్, ఊడి చైతన్య కేసరపల్లి శ్రీను పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన వైసిపి నేత గాదె వెంకన్న

విశాలాంధ్ర - పాలకొల్లు: పాలకొల్లు పట్టణ వైసీపీ నాయకుడు, అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామి (చిన్న గోపురం) ఆలయ మాజీ చైర్మన్ గాదె వెంకన్న ఆపార్టీకి రాజీనామా చేసి, పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు సమక్షంలో

శనివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. పాలకొల్లు మండలం చింతపర్రు గ్రామంలో మన పాలకొల్లు మన రామానాయుడు ఇంటింటి పాదయాత్రలో గాదె వెంకన్న కు, ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు, పార్టీ కండువా కప్పి టిడిపిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ జరగబోయే ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం ఘన విజయం సాధిస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనించాలంటే టిడిపి జనసేన బిజెపి కూటమి అధికారంలోకి రావాలన్నారు. ఎమ్మెల్యే నిమ్మల నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి అభినందనీయమని అన్నారు. ఆయన పనితీరు మెచ్చి, ఈరోజు తెలుగుదేశం పార్టీలో జాయిన్ కావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జీవి, రాపాక ప్రవీణ్ భాను, గాదె సుబ్బారావు, ధనాని సూర్యప్రకాష్, తారక సత్య, మాజీ కౌన్సిలర్ శ్రీఖాకోళ్లపు వెంకన్న, బోణం మనసబు, గుడాల తాతయ్య, బాలి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు,

శృంగవృక్షంలో పివిఎల్ నరసింహరాజు ఎన్నికల ప్రచారం

విశాలాంధ్ర–పాలకోడేరు: మండలంలోని శృంగ వృక్షం గ్రామంలో ఉండి నియోజక వర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పివిఎల్ నరసింహరాజు ఎన్నికల ప్రచారం ప్రారంభించారు.గ్రామంలోనిప్రతి ఇంటికివెళ్లి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఈ ఐదేళ్ల కాలంలో చేసిన అభివృద్ధి, కార్యక్రమాలు సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి కులాలకు మతాలకు అతీతంగా చివరకు సంక్షేమ పథకాలకు అర్హులై ఉంటే పార్టీలు కూడా చూడకుండా ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ పథకం ప్రియతమ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అందేలా చూసారని అన్నారు. ఆయన వెంట శృంగ వృక్షం గ్రామ సర్పంచ్ జంగం సూరిబాబు, మండల పరిషత్తు అధ్యక్షులు భూపతి రాజు చంటి రాజు,వైస్ ఎంపీపీలు చోడదాసి నరేష్ , అడాక లక్ష్మీ తులసి, ఎంపీటీసీలు మల్లుల సూర్య కళ, కాటూరి శాంతకుమారి, పాల చిన్న,మండల వైఎస్ఆర్సిపి అధ్యక్షురాలు కటిక శ్రీదేవి, గ్రామ ఉపసర్పంచ్ కలిదిండి ఆనందరాజు,నాయకులు కొత్తపల్లి కాశీ విశ్వనాథరాజు, గొట్టుముక్కల గోపాల కృష్ణంరాజు, అధిక సంఖ్యలోమహిళలు,కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమితోనే రాష్ట్రానికి మేలు

విశాలాంధ్ర–భీమడోలు: కూటమి ప్రభుత్వం ఏర్పడితేనే రాష్ట్రానికి మేలు జరుగుతుందని, వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అన్నివిధాలా నష్టపోయిందని ఉంగుటూరు నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. ఎన్నికల ప్రచారంలో ఉంగుటూరు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు చేపట్టిన మహాపాదయాత్ర మూడవ రోజైన శనివారం ఉంగుటూరు మండలం కైకరం నుండి పూళ్ల, కురెళ్లగూడెం గ్రామాల మీదుగా భీమడోలు, భీమడోలు జంక్షన్ మీదుగా పోలసానిపల్లికి చేరింది. ఈ కార్యక్రమంలో ధర్మరాజు జనసేన, టీడీపీ శ్రేణులు హారతులు పట్టారు, భారీ గజమాలలు వేసి స్వాగతం పలికారు. పాదయాత్రలో టీడీపీ జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, గన్ని నాగగోపాలం, జనసేన భీమడోలు మండల అధ్యక్షులు ప్రత్తి మదన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వీరేశ్వర స్వామి వారి హుండీ లెక్కింపు

విశాలాంధ్ర - ఐ పోలవరం : మురమళ్ల నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల శ్రీ వీరేశ్వర స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు శనివారం చేపట్టారు. దేవాదాయశాఖ సహాయ కమీషనర్ నాగమల్లేశ్వర రావు, తనిఖీ అధికారి జె. రామలింగేశ్వరరావు, కార్యనిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ సమక్షంలో హుండీలు లెక్కించారు. 70 రోజులకు గాను, ఆలయ ప్రధాన హుండీ రు.5 లక్షల 57 వేల 638, నిత్యకల్యాణం వద్ద కట్న కానుకలు హుండీ రు.4 లక్షల 95 వేల 233, అన్నదానం హుండీ రు.1 లక్ష 58 వేల 085 వెరసి మొత్తం రు.12 లక్షల 10 వేల 956 ఆదాయం సమకూరిందని 1 విదేశీ డాలర్, టైటాన్ వాచ్ వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈమొత్తాన్ని స్థానిక బ్యాంక్ ఆఫ్ బరోడాలో జమచేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పెన్మెత్స వాసురాజు, మట్టపర్తి శివ, రాంబాబు, భక్తులు, సేవకులు, గ్రామస్తులు, ఆలయ అర్చక, పురోహిత కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

జగ్గంపేటలో రన్ ఫర్ జీసస్

విశాలాంధ్ర - జగ్గంపేట : ఈస్టర్ పండుగను పురస్కరించుకుని రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించామని రాష్ట్ర క్రిష్టియన్ ఫైనాన్సు కార్పొరేషన్ డైరెక్టర్ జాన్ వెస్లీ అన్నారు. మండల కేంద్రమైన జగ్గంపేటలో

శనివారం రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత టీచర్స్ కాలనీ జాన్ వెస్లీ స్వగృహం నుండి ర్యాలీ మొదలు పెట్టి నెహ్రూ కాలనీ, శ్రీరామ్ నగర్, పద్మనాభనగర్, కొంగల రావి చెట్టు వీధి, కాకినాడ రోడ్డు మీదుగా గోకవరం రోడ్డుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ ఏసుక్రీస్తు శిలువ పొందిన మూడో రోజు పునరుత్థానం చెందాడని, ఆ రోజున ఈస్టర్ పండుగగా క్రైస్తవులు జరుపుకుంటారని తెలిపారు. ఈస్టర్‌ను పురస్కరించుకుని నిర్వహించిన రన్ ఫర్ జీసస్ కార్యక్రమానికి నియోజకవర్గంలోని పాస్టర్లు, క్రైస్తవులు, జగ్గంపేట ప్రజలు సహకరించారన్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు సుదర్శన్, విజయరాజు, సువార్త పాల్‌కు తదితర పాస్టర్లు, విశ్వాసులు, యువకులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి మంచి జరుగుతుందనే జనసేనలో చేరా : రమేష్

విశాలాంధ్ర - జగ్గంపేట : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ద్వారా రాష్ట్రానికి మంచి జరుగుతుందని భావించి జనసేన పార్టీలో చేరుతున్నానని తుమ్మలపల్లి రమేష్ వెల్లడించారు. శనివారం తొలుతగా



జగ్గంపేట గ్రామ దేవత శ్రీ రావులమ్మ తల్లి ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం జనసైనికులతో కలిసి గోకవరం, గండేపల్లి, జగ్గంపేట, కిర్లంపూడి మండలాల్లో ర్యాలీ నిర్వహించి పిఠాపురం బయలుదేరి వెళ్లారు. పిఠాపురం నియోజకవర్గంలో పవన్ కళ్యాణ్ నిర్వహించే కార్యక్రమంలో పాల్గొని సమక్షంలో పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో రామవరం ఎంపిటిసి దొడ్డ శ్రీను, టిడిపి నాయకులు జీను మణిబాబు, జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి బుదిరెడ్డి శ్రీనివాస్, పాలిశెట్టి సతీష్, జగ్గంపేట, కిర్లంపూడి మండలాల అధ్యక్షులు మరిసే రామకృష్ణ, ఉలిసే బరాజు, మండల యువత అధ్యక్షులు మొగిలి గంగాధర్, పట్టణ అధ్యక్షుడు గవర సుధాకర్ తదితర జనసైనికులు పాల్గొన్నారు.

హుషారుగా "రన్ ఫర్ జీసస్"

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోట మండల పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో "రన్ ఫర్ జీసస్" కార్యక్రమాన్ని హుషారుగా నిర్వహించారు. ఏసుక్రీస్తు మరణాన్ని జయించి

పునరుద్దానుడైన సందర్భాన్ని జ్ఞాపకం చేసుకుంటూ ఆ శుభవార్తను ప్రజలకు చాటి చెబుతూ పుర వీదుల్లో పరుగులు తీశారు. వేకువజామునే ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకూ నిర్వహించిన కార్యక్రమంలో వేలాదిగా క్రైస్తవ ప్రజలు పాల్గొన్నారు. సామర్లకోట సిబిఎం హైస్కూల్ గ్రౌండ్‌లో ఈ "రన్ ఫర్ జీసస్" కార్యక్రమం పెద్దాపురం నియోజక వర్గ ఇంచార్జి దవులూరి దొరబాబు, రాష్ట్ర కార్మిక నాయకులు దవులూరి సుబ్బారావులు మండల పాస్టర్ల అసోసియేషన్ అధ్యక్షులు రెవ డాక్టర్ ఎం. సాల్మన్ రాజు, కార్యదర్శి రెవ డాక్టర్ వి. జాన్, కోశాధికారి రెవ ఆర్ లాజరస్‌లతో కలసి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఈ ప్రదర్శన లూథరన్ చర్చి, పోలీస్ స్టేషన్, పెన్షన్ లైన్, మెహర్ కాంప్లెక్స్, మతం సెంటర్ మీదుగా స్టేషన్ సెంటర్‌కు చేరుకొని ఆపై గాంధీబొమ్మ సెంటర్, బళ్లమార్కెట్, పాత ఎమ్మార్వో సెంటర్, ఆంధ్ర బాప్టిస్ట్ చర్చి మీదుగా సెంటినరీ బాప్టిస్ట్ చర్చి వరకు సాగింది.

ముగిసిన మగ్గం శిక్షణ తరగతులు

విశాలాంధ్ర - రాజానగరం : మండలంలోని కొత్త తుంగపాడు గ్రామంలో గత కొంతకాలంగా సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందిస్తున్న ఉచిత మగ్గం శిక్షణ తరగతులు శనివారం ఘనంగా ముగిశాయి.

దీనిలో భాగంగా శిక్షణ ముగించుకున్న సుమారు 50 మంది మహిళలకు ధ్రువపత్రాలను ఫౌండేషన్ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధినేత సుంకర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తుంగపాడు గ్రామంలో మహిళలు క్రమశిక్షణతో శిక్షణ పొందారని, అందుచే మూడు బ్యాచులకు శిక్షణ అందించమన్నారు. నేర్చుకున్న విద్యకు సార్థకత చేకురాలంటే మగ్గం వర్క్ కి ఖర్చు పెట్టలేని పేదలకు కేవలం మెటీరియల్ సామగ్రి కి అయిన ఖర్చు మాత్రమే తీసుకుంటే ఇద్దరికీ ఆనందం కలుగుతుందని చెప్పారు.అలాగే శిక్షణ పొందిన మహిళలు తమ నివాసాల చుట్టుపక్కల వారికి శిక్షణ అందిస్తే సంతోషిస్తారనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీలు సుంకర నాగేశ్వరరావు ,సుంకర వీరాస్వామి,వినీల,శిక్షకురాలు గంధం కృష్ణ వేణి,ఫౌండేషన్ సభ్యులు , గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘ నూతన కార్యవర్గ ఏర్పాటు

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రంలోని మండల ఆర్యవైశ్య సంఘ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో కొత్తపేట నియోజకవర్గ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ ప్రెసిడెంట్

పివిఎస్ నాగేశ్వరరావు, సెక్రటరీ కె రామచంద్రమూర్తి, వైస్ ప్రెసిడెంట్ సిహెచ్ శేషారావు, ట్రెజరర్ వివిఎస్‌వి సుబ్రహ్మణ్యం మరియు కార్యవర్గ సభ్యులను దుశ్శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియచేశారు.

మెరుగైన వేతనాల కోసం కార్మికుల పోరాటం

విశాలాంధ్ర–దేవరపల్లి: మెరుగైన వేతనాల కోసం గత ఎనిమిది రోజుల నుండి దుద్దుకూరు యూనియన్ ఆఫీస్ వద్ద సింగిల్ లారీలపై పనిచేస్తున్న కార్మికులు సమ్మె చేస్తూ వేతనాల కోసం పోరాడు తున్నారు. యజమానులు వేతనాలు పెంచే విషయంలో నిరంకుశ ధోరణి అవలంబిస్తున్నారని, లారీ కార్మికులకు మెరుగైన వేతనాలు పెంచే వరకు సమ్మె

విరమించబోమని ఆందోళన ఉధృతం చేస్తామని తెలి పారు శనివారం దుద్దుకూరులో నిరసన శిబిరం వద్ద.తెలుగుదేశం పార్టీ గోపాలపురం అభ్యర్థి మద్దిపాటి వెంకటరాజు, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ఆంద్రు అనిల్ కార్మికులకు మద్దతు తెలియజేశారు. సమస్య పరిష్కారానికి భవిష్యత్తులో కార్మికుల సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎస్కే మస్తాన్ యూనియన్ నాయకులు ఆకాష్, పి బాజీ. ఎస్‌కే షఫీ, కొండయ్య, సత్యనారాయణ రాజు, రామకృష్ణ, సతీష్ , ప్రసన్న, కొమ్మర రాజు తదితరులు పాల్గొన్నారు.

మురళీ కృష్ణంరాజుకు అభినందనలు

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : టిడిపి రాష్ట్ర కార్యదర్శిగా ముదునూరి మురళి కృష్ణంరాజును నియమించిన సందర్భంగా కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో గ్రామ టిడిపి బీసీ నాయకులు, టిడిపి కార్యకర్తలు, అభిమానులు ముదునూరి మురళి కృష్ణంరాజును

మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలు, పూలదండలతో అభినందనలు తెలియజేశారు.

టిడిపి నుండి వైయస్సార్‌సీపీలో చేరికలు

విశాలాంధ్ర - రౌతులపూడి : మండలంలోని గిడజాం గ్రామము నుండి వైయస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఆకర్షితులై మరియు వరుపుల సుబ్బారావు మీద ఉన్న అభిమానముతోను రౌతులపూడి సొసైటీ డైరెక్టర్ బండారు బైరాగి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నుండి 10

కుటుంబాల వారు వైయస్సార్ పార్టీలో చేరారు. ముందుగా గిడజాం చేరుకున్న ప్రత్తిపాడు వైఎస్సార్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి వరుపుల సుబ్బారావు గ్రామంలో నూతనంగా ప్రతిష్టించిన గంగాలమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం పార్టీలో చేరుతున్న బండారు నాగబాబు, అల్లాడ రాజు, కాట్రెడ్డి లోవ మొదలగు పది కుటుంబాల వారు వైయస్సార్ పార్టీలో చేరారు. వారందరినీ పార్టీ కండువా కప్పి సుబ్బారావు పార్టీ లోనికి ఆహ్వానించారు. వైయస్సార్ పార్టీ నాయకులు వాసిరెడ్డి జమీలు గుమ్మరేగుల సర్పంచ్ రాపర్తి రామకృష్ణ, బండి విశ్వామిత్ర బండి కృష్ణ, డిసిసిబి డైరెక్టర్ పులి మధుతదితరులు పాల్గొన్నారు.

గణపవరం మండలంలో సాయుధ బలగాలు కవాతు

విశాలాంధ్ర - గణపవరం: నిడమర్రు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.వి సుభాష్ ఆధ్వర్యంలో గణపవరం ఎస్ ఐ వేముల వెంకటేశ్వరరావు తన సిబ్బందితో కలిసి రాబోయే జనరల్ ఎలెక్షన్ పురస్కరించుకొని శనివారం గణపవరం మండలంలోని మొయ్యేరు ,ముప్పర్తిపాడు,కేశవరం ,మల్లపురాజుపేట ,జల్లికాకినాడ గ్రామాలలో సాయుధ

బలగాల కవాతు నిర్వహించి ప్రజలు నిస్పక్షపాతముగా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని నిడమర్రు సర్కిల్ ఇన్స్పెక్టర్ సుభాష్ తెలియజేశారు.

విద్యకే వన్నె తెచ్చిన సంస్థ జిఎస్ఎల్

- దశాబ్దం పూర్తి చేసుకున్న జీఎస్ఎల్ దంత కళాశాల

- ఎఐఐఎంఎస్ ప్రొఫెసర్ డాక్టర్ రీతూ

విశాలాంధ్ర - రాజానగరం : వైద్య విద్య రంగానికే వన్నె తెచ్చిన సంస్థల్లో జిఎస్ఎల్ కళాశాల ప్రథమ స్థానంలో ఉంటుందని న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎఐఐఎంఎస్) దంతవైద్య పరిశోధనా విభాగం అధిపతి, ఎత్తు మరియు వంకర పళ్ళు సరిచేసే (ఆర్థోడాంటిస్ట్) ప్రొఫెసర్ వైద్యులు డాక్టర్ రీతూ అన్నారు. మండలంలోని జిఎస్ఎల్ దంత వైద్య కళాశాల ఏర్పాటు చేసి పది వసంతాలు

పూర్తిచేసుకుని 11 ఏటా అడుగుపెడుతున్న సందర్భంగా గత వారం రోజులుగా నిర్వహిస్తున్న వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎఐఐఎంఎస్ ప్రొఫెసర్ డాక్టర్ రీతూ మాట్లాడుతూ చదువుని ఉత్సాహపరిచే వాతావరణం నెలకొల్పడం జిఎస్ఎల్ సొంతమన్నరు.మహా నాగరాలు,పెద్ద పెద్ద జంట నగరాల్లో సైతం లేని అధునాతన సాంకేతిక పరికరలైన అతిపెద్ద లైబ్రరీ, మాడ్యూల్స్, మెడికల్ సిమ్యులేషన్ లాబ్ సేవలు విద్యార్థులకు అందించిన జిఎస్ఎల్ యాజమాన్యం సేవలను కొనియాడారు. సమాజంలో ఉన్నతమైన దంత వైద్య నిపుణులుగా పేరు గడించెందుకు ఘనమైన దారిని జిఎస్ఎల్ చూపిస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదని చెప్పారు.

విశిష్ట అతిథిగా హాజరైన జిఎస్ఎల్ డెంటల్ కళాశాల మెంటార్ డాక్టర్ గన్ని సందీప్ మాట్లాడుతూ నగరాలు, పెద్దపట్టణాలలో మాత్రమే అందుబాటులో వుండే దంతవైద్య సేవలను గ్రామీణప్రాంతాలవారికి అందచేసే లక్ష్యంతో జిఎస్ఎల్ దంత కళాశాల ఏర్పాటు చేశామన్నారు.గత పదేళ్ళుగా సంతృప్తికరమైన ఫలితాలను అందించమని తెలిపారు. అలాగే జిఎస్ఎల్ సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, ప్రిన్సిపాల్ గంటా సునీల్ విద్యార్థులు అభివృద్ధిని ఆకాంక్షిస్తూ పలు సందేశాలను అందించారు.కళాశాల దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులు ఉత్సాహంగా స్ఫూర్తిదాయకంగా నిర్వహించిన వేడుకలు అందర్నీ ఆకట్టుకున్నాయి.అనంతరం జిఎస్ఎల్ సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావును ప్రిన్సిపాల్ గంటా సునీల్ తదితరులు ఘనంగా సత్కరించారు.

ప్రత్తిపాడులో కాంగ్రెస్ నిరసన

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏఐసిసి పిలుపు మేరకు పిసిసి సభ్యులు ధరణాలకోట శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో శ్రీను మాట్లాడుతూ ఐటీశాఖ ద్వారా 1823 కోట్లు కట్టాలని కాంగ్రెస్ పార్టీకి నోటీసులు జారీ చేయడంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. బిజెపి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలపై ప్రజలు గమనిస్తున్నారు. రాబోయే

రోజుల్లో బిజెపి పార్టీ భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు నీరుకొండ సత్యన్నారాయణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ కొప్పన కోటేశ్వరరావు, ఓబిసి జనరల్ సెక్రటరీ కొల్లు వీరగణేష్, ఎన్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

దేవాలయానికి శివ కుమార్ యాదవ్ ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - రౌతులపూడి : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం రౌతలపూడి మండలం గిడజం గ్రామంలో వెలసిన శ్రీ గంగాలమ్మ అమ్మవారు విగ్రహ ప్రాణప్రతిష్టకి ఆలయం నిర్మించిన ఆర్టీసీ ఉద్యోగి గిరిబాబు ఆహ్వానం మేరకు హాజరైన భారత చైతన్య యువజన పార్టీ నాయకులు గొంప శివ కుమార్ యాదవ్. ఆలయంలో అమ్మవారు దర్శనం చేసుకుని తన వంతు సహాయంగా రూ.10000/ గిరిబాబు చేతుల మీదగా ఆలయానికి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దేవర శ్రీను (సి రాయవరం మాజీ సర్పంచ్), సానబోయిన కుశరాజు, పంపనబోయిన శ్రీను, చిట్టిబాబు డిజె పురం, కుండల శ్రీను, కోన గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అభయ ఆంజనేయ విగ్రహావిష్కరణ

విశాలాంధ్ర - కాట్రేనికోన : కుండలేశ్వరంలో నూతనంగా నిర్మించిన అభయ ఆంజనేయస్వామి విగ్రహావిష్కరణ కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ఈ విగ్రహాన్ని కాకినాడకు చెందిన వనచర్ల రవీంద్రనాద్ కుటుంబ సభ్యుల ఆర్థిక సాయంతో నిర్మించారు. అర్చకులు కాళ్ళకూరి కామేశ్వరరావు అధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భారీ ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. తెదేపా జనసేన కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు స్వామి వారిని దర్శించుకున్నారు.